క్లుప్తంగా

'స్పందన'కు 27 అర్జీలు

సీతమ్మధార: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 27 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్లి శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తాహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జోన్-5కు నాలుగు వినతులు



వినతిపత్రాలు పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 04 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 02, పబ్లిక్ హెల్త్‌కు 01, యూసీడీకి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాస్‌రావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ అధికారి అపరంజిత, పబ్లిక్ హెల్త్ సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్వో ఏపీడీ కె.శైలజ పాల్గొన్నారు.


మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మృతుడు చైతన్య

సీతమ్మధార: మనస్తాపంతో యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ద్వారకా జోన్ పోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. సీతమ్మధార టీపీటీ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్ పెంట్‌హౌస్‌లో సన్యాసప్పుడు, పాపమ్మ ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు చైతన్య(20) డిప్లమా పూర్తిచేసి ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడు పది రోజులుగా దిగాలుగా ఉంటున్నాడు. దీంతో అతడి సోదరుడు ధైర్యం చెప్పాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెంట్‌హౌస్ వెనుక డోర్ లాక్ చేసుకున్నాడు. వరసకు సోదరుడైన యువకుడు పలుమార్లు ఫోన్ చేసినా.. ఎత్తకపోవడంతో ఇంటికి వచ్చి తలుపులు కొట్టాడు. ఎంతకి డోర్ తీయకపోవడంతో చెరకు రసం బండి వద్ద ఉన్న తల్లిదండ్రులకు చెప్పడంతో అందరు కలిసి తలుపులు విరగొట్టారు. చైతన్య ఫ్యాన్‌కు ఉరివేసుకొని విగత జీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరయ్యారు. ద్వారకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి సీఐ సింహాద్రినాయుడు, ఎస్ఐ ధరేంద్ర చేరుకుని పరిశీలించారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-1 చివరలో గల పార్సిల్ ఆఫీస్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్పీ) ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ వి.బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం ప్లాట్‌ఫారం-1 చివరలో సుమారు 25 ఏళ్ల గల ఓ వ్యక్తి మరణించాడని, తెలుపు రంగు ప్యాంట్, తెలుపు నలుపు రంగు చెక్స్ గల రౌండ్ నెక్ టీ షర్ట్ ధరించి ఉన్నాడని బాలాజీరావు చెప్పారు. ఇతని వద్ద ఏవిధమైన ఆధారాలు లేవని, వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీని గానీ లేదా 96661 22722, 94406 27547 నంబర్లలో తెలియజేయాలన్నారు.

సర్కారు బడికి మహర్దశ

- సరికొత్తగా వెంకటేశ్వర కాలనీ ప్రాథమిక పాఠశాల
- రూ.16 లక్షలతో అత్యాధునిక సదుపాయాలు
- ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల హర్షం



వెంకటేశ్వర కాలనీలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల భవనం



పాఠశాలలో జరుగుతున్న విద్యుత్ వైరింగ్ పనులు



నిర్మాణంలో ఉన్న అదనపు టాయిలెట్లు

సీతంపేట: గత ప్రభుత్వంలో కనీస సదుపాయాలకు నోచుకోని ప్రభుత్వ పాఠశాలలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహర్దశ పట్టింది. మన బడి నాడు-నేడు కార్యక్రమంతో సర్కారు బడుల రూపురేఖలు మారిపోయాయి. మొదటి విడతలో ఉత్తర నియోజకవర్గంలో చాలా వరకు జీవీఎంసీ పాఠశాలను అభివృద్ధి చేశారు. కార్పొరేట్ స్కూళ్లకు మించిన సౌకర్యాలు కల్పించారు. రెండో విడత నాడు-నేడులో భాగంగా 43వ వార్డు వెంకటేశ్వర కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేస్తున్నారు. సుమారు రూ.16 లక్షలతో అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నారు. 1990లో ఈ స్కూల్ ఏర్పాటు చేసిన తర్వాత ఇప్పటి వరకు మళ్లీ అభివృద్ధి చేసిన పాపాన పోలేదు. సుమారు 30 ఏళ్ల తర్వాత సీఎం వైఎస్ జగన్ పాలనలో పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. ఎన్నో ఏళ్ల తరబడి కనీస సదుపాయాలకు నోచుకోక చాలీచాలని వసతులతో చదువులు నెట్టుకొస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని వసతులతో..

కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ఈ పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తున్నారు. స్కూల్‌లో ఉన్న ఆరు తరగతి గదుల్లో.. నాలుగింటిని అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రానైట్ ఫ్లోరింగ్, విద్యుత్ వైరింగ్ కొత్తగా వేస్తున్నారు. పాడైన కిటికీలు తొలగించి కొత్తవి అమర్చారు. బాలికలు, బాలురకు వేర్వేరుగా నాలుగేసి టాయిలెట్లు నిర్మిస్తున్నారు. వీటికి నిరంతర నీటి సరఫరా కల్పిస్తున్నారు. పిల్లల తాగునీటి కోసం 500 లీటర్ల వాటర్ ప్యూరిఫైర్ ఏర్పాటు చేస్తున్నారు.

సెంట్రల్ ఇండెంట్‌తో..

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులకు, కేంద్రం ఇచ్చే నిధులతో మరిన్ని సదయపాయాలు పాఠశాలకు సమకూరనున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులతో పిల్లలు కూర్చోడానికి డెస్క్ బెంచీలు, ఎలక్ట్రికల్ ఉపకరణాలు ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, బాత్‌రూమ్ టైల్స్, కమోడ్స్, పెయింటింగ్ పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం విద్యుత్ వైరింగ్, ఫ్లోరింగ్, టాయిలెట్ల నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. వేసవి సెలవుల అనంతరం పాఠశాల ప్రారంభం నాటికి పనులు మొత్తం పూర్తిచేయనున్నారు.

రూ.16 లక్షలతో స్కూల్ అభివృద్ధి



వార్డులో ఉన్న ఒకే ఒక ప్రాథమిక పాఠశాల ఇది. ఏళ్ల తరబడి అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి ఇస్తున్న ప్రాధాన్యంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. నాడు-నేడు రెండో విడతలో వెంకటేశ్వర కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రూ.16 లక్షలు మంజూరయ్యాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని వసతులతో పాఠశాల సిద్ధంగా ఉంటుంది.

– పెద్దిశెట్టి ఉషశ్రీ, కార్పొరేటర్, 43వ వార్డు

అన్ని వసతులు సమకూరనున్నాయి



1990లో ఈ పాఠశాల ఏర్పాటు చేశారు. 5 తరగతి గదులు, ఒక గదిని బాల్వాడీకి కేటాయించారు. గతంలో బాలికలకు ఒకటి, బాలురకు ఒకటి టాయిలెట్స్ ఉండేవి. చాలా ఇరుగ్గా ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు బాలికలకు 4, బాలురకు 4 చొప్పున టాయిలెట్లు నిర్మిస్తున్నారు. గ్రానైట్ ఫ్లోరింగ్, పెయింటింగ్, బెంచీలు, లైట్లు, ఫ్యాన్లు అన్ని సమకూరనున్నాయి.

– ఎస్.వి.దొర, ప్రధానోపాధ్యాయుడు

సంక్షేమ బోర్డు సాధనకు పోరాటం



సత్యం కూడలిలో ప్రచారం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతంపేట: ఆటో, మోటారు కార్మికుల సంక్షేమ బోర్డు సాధనకు పోరాడాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం సత్యం జంక్షన్ వద్ద మేడే ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఇంధన ధరలు తగ్గించి, ఆటో డ్రైవర్లకు రవాణా శాఖ అధికారులు ఇచ్చిన పాత ఈ-చలానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, గ్రీన్ టాక్స్ రద్దు చేసి ఆటో డ్రైవర్ల బతుకుకు రక్షణ కల్పించాలన్నారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో స్టాండ్ నాయకులు సిహెచ్.రామకృష్ణ, బి.అప్పారావు, రావికృష్ణ, వి.లక్ష్మణరావు, ఎం.కామరాజు, వి.సంతోష్‌కుమార్, దుర్గాప్రసాద్, లక్ష్మణరావు, గణేష్, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన



కంచరపాలెం మెట్టు వద్ద ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు

మద్రిపాలెం: కంచరపాలెం పరిధిలో ఆటో డ్రైవర్లకు సోమవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు ఆధ్వర్యంలో ఎస్ఐలు పాపారావు, వాసుదేవరావు, ఉల్‌హక్ బృందాలుగా ఏర్పడి కంచరపాలెం మెట్టు, ఊర్వశి జంక్షన్, బిర్లా, ఆర్ అండ్ బీ, ఎన్ఏడీ కూడళ్లలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులకు అనుమతించరాదని, డ్రైవర్ సీట్లో పక్కన ఎవరూ కూర్చోకూడదని, విధిగా డ్రైవర్లు యూనిఫాం ధరించాలని, తప్పక నిబంధనలు పాటించాలని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆటో ఇన్సూరెన్స్ లాంటి రికార్డులు తప్పక కలిగి ఉండాలని చెప్పారు. ఓవర్ స్పీడ్‌తో ఆటోలు నడపరాదని, ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేయకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐలు హెచ్చరించారు.

కాలుష్య నియంత్రణకు దూరం..!

- ప్రజా రవాణాను వినియోగించని జోన్-5 అధికారులు
- ప్రభుత్వ, సొంత వాహనాల్లో కార్యాలయానికి రాక



జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయ ఆవరణలో సోమవారం పార్క్ చేసిన అధికారుల వాహనాలు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 అధికారులు, ఉద్యోగులు కాలుష్య నియంత్రణలో భాగస్వాములు కాలేదనే చెప్పాలి. జీవీఎంసీ మేయర్, కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు నగరాన్ని కాలుష్యం బారి నుంచి కాపాడాలని పిలుపునిస్తూ ప్రతి సోమవారం వెహికల్-ఫ్రీ జోన్ పాటించి తమ వంతు కృషి చేస్తున్నారు. జోన్-5 అధికార గణం మాత్రం ఇందుకు దూరంగా ఉంటోందని పలువురు విమర్శిస్తున్నారు. జోన్-5లో ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్, యూసీడీ, టౌన్ ప్లానింగ్, డెత్ అండ్ బర్త్, తాగునీరు, విద్యుత్ లైట్లు, రెవెన్యూ విభాగాల అధికారులు మాత్రం ప్రభుత్వ వాహనాలతోపాటు సొంత వాహనాల్లో ప్రతి సోమవారం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయానికి విధులకు వస్తున్నారు. ఇక్కడి సౌకర్యం కేంద్రానికి వచ్చే జోన్ ప్రజలు కూర్చోడానికి చోటులేకపోయినా.. జోనల్ విభాగాల అధికారుల వాహనాల పార్కింగ్‌తో కార్యాలయం ప్రతి సోమవారం కళకళలాడుతోందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని, దాని కట్టడికి అందరి సహకారం అవసరమని, ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు కాలుష్య నియంత్రణకు వారంలో ఒక్కరోజు ప్రజా రవాణాను ఉపయోగించాలని ప్రభుత్వం సూచించినా.. జోన్-5 అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కాలుష్య నియంత్రణకు జోనల్ అధికారులు, ఉద్యోగులు సహకరించాలని సూచిస్తున్నారు.

అధ్వానంగా పరిసరాలు



అంబేద్కర్ కాలనీలో చెత్తతో నిండిన డస్ట్‌బిన్

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులోని పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతోంది. దీంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. అంబేద్కర్ కాలనీ, కళింగనగర్ ఈస్ట్ పార్క్ గోడకు ఆనుకుని వ్యర్థాలను పడేయడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై చెల్లాచెదురుగా పడి ఉన్న వ్యర్థాలను పశువులు, కుక్కలు, పందులు వంటి మూగజీవులు తిని అనారోగ్యానికి గురవుతున్నాయి. ఒక పక్క పారిశుధ్య సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నప్పటికీ.. మరో పక్క స్థానికులు అక్కడ మళ్ల పడేయడంతో సమస్య నెలకొంది. దోమలు, ఈగలు వృద్ధి చెంది ఆందోళన కలిగిస్తున్నాయని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నేడు రామానుజాచార్య జయంతి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం భగవత్ రామానుజాచార్య జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామానుజాచార్యకు పంచామృతాభిషేకం, సాయంత్రం 6 గంటలకు తిరువీధి మహోత్సవం నిర్వహించి వైభవుడికి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని 11 కేవీ సీతంపేట ఫీడర్ ఎల్‌టీలైన్ మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సీతంపేట కృష్ణుడి గుడి, ఎస్ఎస్ 339 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అబిద్‌నగర్, ఈస్ట్ గేట్ పరిధిలో..

తాటిచెట్లపాలెం: అబిద్‌నగర్ 11 కేవీ, ఈస్ట్ గేట్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అబిద్‌నగర్, అబిద్‌నగర్ పార్క్, షాదీఖానా, బీఎండబ్ల్యూ షోరూం మెయిన్ రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, సాయిబాబా గుడి, రాఘవేంద్ర హాస్పిటల్, బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.


27 నుంచి వేసవి శిక్షణ శిబిరం

బీచ్ రోడ్డు: ఈ నెల 27 నుంచి పిల్లల కోసం వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు వైఎంసీఏ ప్రధాన కార్యదర్శి స్వరూప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎరిబిక్స్, ఎయిర్ గన్, కాలిగ్రఫీ, చెస్, క్రికెట్, డ్యాన్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, జూడో, కరాటే, గిటార్ అండ్ కీ బోర్డు, స్కేటింగ్, టేబుల్ టెన్నిస్, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. మే 31 వరకు సాగనున్న ఈ శిబిరంలో 5 నుంచి 17 ఏళ్ల వయస్సు వారు పాల్గొనవచ్చని చెప్పారు. వివరాలకు 0891-2755826, 82972 23480 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

ప్రజా వినతుల పరిష్కారానికి ప్రణాళిక



కార్పొరేటర్లతో సమీక్షిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై కార్పొరేటర్లతో నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సమీక్ష నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులు, నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు అందరూ ఒక రిపోర్టు తయారు చేయాలని సూచించారు. సమస్యలు పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, కంటిపాము కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, శశికళ, పార్టీ వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

కోటి కుటుంబాలకు చేరువైన 'జగనన్నే మా భవిష్యత్తు'

- ప్రజల్లో సీఎం జగన్‌పై పెరిగిన నమ్మకం
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు



ప్లకార్డులు ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్లు

సీతమ్మధార: జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం కోటి కుటుంబాలకు చేరువైందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగిందని పేర్కొన్నారు. మరో 30 ఏళ్లు ఆయనే సీఎంగా ఉంటారని జోస్యం చెప్పారు. అర్హులందరికీ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కొన్ని పత్రికలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు దుష్ట ప్రచారాన్ని మానుకోవాలని, లేని పక్షంలో ప్రజలు మళ్లీ బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. టీడీపీకి దమ్ముంటే ఒంటరిగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. మెగా పీపుల్ సర్వే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కేడర్ ఆధ్వర్యంలో నిజాయితీగా, నిబద్ధతతో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరుగుతోందని చెప్పారు. ఇది విజయవంతం కావడంతో టీడీపీ నాయకుల నోర్లు మూతపడ్డాయన్నారు.

ఎమ్మెల్యే గంటాకు కానరాని అభివృద్ధి

ఉత్తర నియోజకవర్గంలో ఆరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మించి ప్రారంభించామని, మరో మూడు నిర్మాణంలో ఉన్నాయని కె.కె.రాజు తెలిపారు. నాడు-నేడులో భాగంగా ఒక్కో ప్రభుత్వ పాఠశాలకు రూ.40 లక్షల నుంచి సుమారు రూ.2.50 కోట్ల వరకు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. ఎప్పుడు ఎవరి పక్షాన ఉంటారో, ఏ పార్టీలో ఉంటారో తెలియని ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు.. ఏవో రెండు భవనాల ఫొటోలు ట్విట్టర్‌లో పెట్టగా.. దానికి తాము కౌంటర్‌గా ఒక స్కూల్, మూడు ఆస్పత్రులు, రూ.2.5 కోట్లతో అభివృద్ధి చేసిన పార్కుల ఫొటోలను పెట్టామన్నారు. అనంతరం కార్యక్రమ ప్లకార్డులు ప్రదర్శించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, ఆళ్ల లీలావతి, సాడి పద్మారెడ్డి, పి.ఉషశ్రీ, కె.కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, శశికళ, పార్టీ వార్డు అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

42వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ 237 సచివాలయం పరిధి పరదేశమ్మ ఆలయం ఎదురు వీధిలో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వీటికి సోమవారం కార్పొరేటర్ ఆళ్ల లీలావతితో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేసారు. ముందుగా పరదేశమ్మ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులకు సంబంధించి సుమారు రూ.18 లక్షల నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో జీవీఎంసీ డీఈ భరణి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు షేక్ జుబేర్, డైరెక్టర్లు నాగమణి, ప్రసాద్, పార్టీ నాయకులు ఆళ్ల శ్రీనివాస్, గాలి ప్రసాద్, యడ్ల శ్రీనివాసరెడ్డి, గౌరీ, కృష్ణవేణి, ఆళ్ల గోపి, షాజహాన్, మాధవ్, గణేష్, నూకరాజు, రమణమూర్తి, శ్రీనివాసరెడ్డి, వెంకటరావు, జగన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

47వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో..

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు అరుంధతి నగర్, సురేష్‌రామ్ నగర్ కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సోమవారం కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరితో కలిసి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.35 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జోన్-5 డీఈ భరణికుమార్ తెలిపారు. అరుంధతి నగర్‌లో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.30 లక్షలు, సురేష్‌రామ్ నగర్‌లో సీసీ రోడ్లు, మెట్లమార్గాల మరమ్మతులు, డ్రెయిన్ల పనులకు రూ.5 లక్షలు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించినట్లు కె.కె.రాజు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ అర్చన, పార్టీ నాయకులు వి.అప్పారావు, వీర రాఘవులు, విజయ్, సురేష్, కనకరాజు, గోవింద్, నరసింగ్, గురువోజీ, అప్పన్నదొర, లక్ష్మణ్‌సాయి, అనిల్‌కుమార్, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నడక పోటీల విజేతలు వీరే..

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాకర్ లంకా ఆదినారాయణ స్మారక నడక పోటీల్లో విజేతల వివరాలను వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వెంకట సుధాకర్ ప్రకటించారు. మహిళలకు సంబంధించి 70+ విభాగంలో డాక్టర్ కె.వైజయంతి మాల ప్రథమ బహుమతి, 61-70 ఏళ్ల వయసు విభాగంలో సిహెచ్.కృష్ణకుమారి ప్రథమ, కె.నాగమణి ద్వితీయ, ఎం.చంటితల్లి తృతీయ స్థానం, 51-60 ఏళ్ల విభాగంలో కె.రామలక్ష్మి ప్రథమ, పి.శ్రీదేవి ద్వితీయ, ఆర్.సత్యవతి తృతీయ స్థానం, 41-50 ఏళ్ల విభాగంలో కె.వరలక్ష్మి ప్రథమ, ఎం.భాగ్యలక్ష్మి ద్వితీయ, ఎం.జయ తృతీయ స్థానం, 31-40 ఏళ్ల విభాగంలో సిహెచ్.రమాదేవి ప్రథమ, కె.అరుణ ద్వితీయ, మినటి నాయక్ తృతీయ స్థానాల్లో నిలిచారు.

- పురుషులకు సంబంధించి 81-90 ఏళ్ల విభాగంలో నిమ్మగడ్డ బుచ్చయ్య ప్రథమ, సిహెచ్.కృష్ణమూర్తి ద్వితీయ, కె.జి.కృష్ణారావు తృతీయ స్థానం, 71-80 ఏళ్ల విభాగంలో పి.మాణిక్యం ప్రథమ, ఎస్.నరసింహారావు ద్వితీయ, బి.దొరబాబు తృతీయ, 66-70 ఏళ్ల విభాగంలో వి.రాంబాబు ప్రథమ, సిహెచ్.చంద్రశేఖర్ ద్వితీయ, ఎస్.రామ్మోహన్‌రావు తృతీయ, 61-65 ఏళ్ల విభాగంలో బి.మోహన్‌రావు ప్రథమ, డి.శ్రీనివాస్ ద్వితీయ, కె.బలరామ్ తృతీయ, 51-60 ఏళ్ల విభాగంలో ఎస్.ఎన్.సుధాకర్ ప్రథమ, జీవీ ఆనందరావు ద్వితీయ, ఎస్.శ్రీనివాసరావు తృతీయ, 41-50 ఏళ్ల విభాగంలో రవీందర్ బెహరా ప్రథమ, డాక్టర్ ఆర్.బి.కె చక్రవర్తి ద్వితీయ, ఆర్.జైభీమ్ తృతీయ, 31-40 ఏళ్ల విభాగంలో సిహెచ్.నర్సింగరావు ప్రథమ, పి.శ్రీనివాస్ ద్వితీయ, పి.సుబ్రహ్మణ్యం తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలను వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

డీపీటీవోపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్ఎంయూ అసోసియేషన్ సభ్యులు

సీతమ్మధార: విశాఖ జిల్లాలో ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్(ఏపీపీటీడీ), డిప్యూటీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్(డీపీటీవో) కొంతమంది అధికారులను, ఉద్యోగులను ఇబ్బంది పెడుతూ, ప్రయాణికులకు అసౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని ఏపీపీటీడీ ఎన్ఎంయూ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి ప్రభుత్వంలోకి తీసుకున్నారని గుర్తుచేశారు. దానికి తామంతా ఆయనకు రుణపడి ఉంటామన్నారు. ప్రస్తుత డీపీటీవో ఈ జిల్లాకు అధికారిగా వచ్చినప్పటి నుంచి అన్ని డిపోల్లో బస్సుల సంఖ్య తగ్గించి ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తున్నారని, 30 ఏళ్లు దాటి విధులు నిర్వహిస్తున్న కొంత మంది ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి తొలగిస్తున్నారని, ఉద్యోగులకు ఎటువంటి వసతులు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వాల్తేరు డిపో ఆవరణలోని డీఎం ఆఫీసులో అసాంఘిక కార్యకలాపాలు నిత్యం జరుగుతున్నాయని ఆరోపించారు. డీపీటీవోపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ చైర్మన్ బి.వి, సెక్రటరీ ఆర్.వసంతరావు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.